# ప్రిఫేస్

ఆ మధ్య మా ఇంటికి ఒకతను వచ్చేడు. మనిషి చదువుకున్న వాడిలాగే కనిపించేడు.

"నేను మీ ఫేన్ ని" అన్నాడు.

"సంతోషం" సంతోషించేను.

"మీ కథలంటే నాకిష్టం" అన్నాడు.

"థేంక్స్" అన్నాను.

"మీ కథలన్నీ దరిద్రవేఁ" అన్నాడు.

నేనేం అన్లేదు.

నా పుస్తకాలేవైనా ఉంటే ఇస్తే చదువుతానన్నాడు.

కథల మాటెలా ఉన్నా పుస్తకాలకి మాత్రం ఎప్పుడూ దరిద్రవేఁ. అప్పుడప్పుడు నేనే ఎవరిదగ్గరైనా ముష్టెత్తుతాను.

ఇంతలో మా కుక్క వచ్చి శ్రీరామచంద్రుడి దగ్గర హనుమంతుడిలా నా కాళ్ల దగ్గర కూర్చుంది. అతనా కుక్కవైపు పరిశీలనగా చూస్తూ "ఆ మధ్య మీరు రాసిన కథలో కుక్క ఇదేనా?" అన్నాడు కథలో కుక్కకీ, దీనికీ పోలిక వెతుకుతూ.

నేను తుళ్లిపడ్డాను.

నయం! కథలో రాసిన మొగుడు ఇతనేనా అనలేదు మావార్ని చూపించి.

నేను కథలో రాసిన ప్రతి వస్తువూ, మనిషీ మా ఇంట్లో ఉండాలని నేననుకోలేదు. అలాగే సంఘటనలూ నావి కావు.

ఈ మధ్య నామీద ఓ కామెంట్ ప్రచారంలో ఉంది. "ఆవిడ అన్నీ ఫస్ట్‌పెర్సన్‌న్లో రాస్తోంది. పెర్సనల్ టచ్ ఉంటోంది" అని. ఏ పెర్సన్లో

రాసినా అందులోని సంఘటన ముఖ్యం. అది నాకే జరగనక్కర్లేదు.

సోమర్సెట్ మామ్ రాసిన నవలల్లో చాలా భాగం ఫస్ట్‌పెర్సన్లోనే ఉంటాయి.

ఫస్ట్ పెర్సనైనా, థర్డ్ పెర్సనైనా అందులో పాయింటు ముఖ్యం అని నా నమ్మకం. అంతే!

అదీకాక రచయితే కథలో ఓ పాత్ర అయితే రాయడం బావుంటుంది. ఇది కేవలం నా నమ్మకం. ఇంతకీ అసలు కథ –

అబ్బో! ఎప్పటి మాట!

ఇరవైయేళ్ల క్రితం... ఇంకా ఎక్కువేనేమో!

ఏఁవిఁటో! వెధవ డేట్లు జ్ఞాపకం ఉండిచావవు.

ఆంధ్రదేశమంతా ఒక్క కుదుపు కుదుపేసింది.

రైటర్స్ గుండెల్లో రాళ్ల వర్షం పడింది.

ఏఁవిఁటి సార్? ఆ వార్త?

"శాస్త్రిగార్ని మూసేసేరుట"

రైటర్సంతా పెన్నులు మూశేసేరు.

ఎప్పుడు ఎవర్ని మూసేస్తారో అన్న భయం.

పోలీసులకి లెఫ్టేవిఁటి? రైటేవిఁటి?

చేతిలో అధికారం ఉంది. జైలుంది.

ముయ్యడం ఎంతసేపు?

నేను పెన్ను ముయ్యలేదు.

కన్నూ ముయ్యలేదు.

తుఫాను నాటి రాత్రి మేడకూలి నేను, పిల్లలు సజీవ సమాధి అయిపోతావేఁమో అన్నప్పుడు కూడా నేనంత భయపడలేదు.

"బీనాదేవిగారూ, మనల్ని మూసిన్నాడే సోషలిజం వచ్చేస్తుంది" అన్నారు శాస్త్రిగారోసారి. నిజంగా సోషలిజం వస్తుందంటే మమ్మల్ని మూసినా ఫరవాలేదు.

హాయిగా జైల్లో నవలలైనా రాసుకోవచ్చు.

జైల్లో హాయి ఏఁవిఁటో అన్న డౌటు రాలేదు.

ఇంతకీ మర్నాడు సోషలిజం రాగానే రిలీజైపోతాం కదా.

పైగా రామాయణంలో ఉడత సాయంలాగా, సోషలిజం రావడానికి నేనూ సాయపడుతున్నానన్న కించిత్ గర్వం కూడా ఫీలయ్యాను.

(జెడ్జి కూతుర్ని, జెడ్జి భార్యని నన్ను ముయ్యరన్న ధీమా సబ్ కాన్షస్‌గా ఉండేదేమో!)

ఇప్పుడింక శాస్త్రిగారి టర్న్ అయిపోయింది. సీనియారిటీ ప్రకారం తరవాత నేనే. పైగా నేనూ, పిల్లలూ ఉండేవారం.

నేనూ, మావారూ డైవోర్సు తీసుకోలేదు. అయినా హైకోర్టువారి ధర్మవా అని పన్నెండేళ్లు విడిగా ఉన్నాం.

జ్యుడిషియల్ సెపరేషనంటే ఇదేనేమో!

నా దగ్గర పిల్లలైనా ఉన్నారు. మావారు ఒంటరిగానే ఊళ్లు పట్టుకొని తిరిగేరు పాపం!

హైకోర్టువారికి మా ఉసురు తగలక పోతుందా!?

ఓసారి మా వారొచ్చినప్పుడు గోలపెట్టేశేను నన్ను మూసేస్తే ఎలా అని? నా గోలేకాని ఆయనకి చీవ కుట్టినట్టుగా కూడా లేదు. ముందు ఫిలసాఫికల్‌గా ఓ నవ్వు పారేశేరు. తరవాత –

"నీకసలు బొత్తిగా బుర్రలేదేవిటీ? నిన్ను మూస్తే వాళ్లకేం ఒరుగుతుంది తిండి దండగ? అయినా మన ప్రభుత్వానికి బుర్రలేదు. లేకపోతే రైటర్‌ని మూసెయ్యడవేఁవిఁటి వాళ్ల వెర్రి కాకపోతే?

మనవేం ఫ్రాన్సువాళ్లవా? కాదే.

రష్యా వాళ్లవాఁ? కాదే

పుస్తకాలు చదివి చైతన్యవంతులవుతారా మనవాళ్లు? మనం ఫక్తు భారతీయులం.

అందునా ఆంధ్రులం.

బద్ధకం మన సొత్తు.

బజ్జోడం మన వృత్తి.

మన బుర్రల్లోకి ఏవైఁనా ఎక్కించాలంటే పుస్తకాలు, పత్రికలూ కాదు కావల్సింది.

మంచి సుత్తి.

అది పెట్టి బుర్ర బద్దలుకొట్టి లోపల కెక్కించాల్సిందే. అప్పుడైనా ఎక్కుతుందన్న గారంటీ లేదు.

ఈ మాటే మొన్న ఓ ఎస్పీతో అన్నాను. అతనేవన్నాడో తెలుసా? 'అంతా మమ్మల్ని తిడతారుగాని మా చేతిలో ఏవుందండీ. అంతా ఆ పైవాడిష్టం. మేము కేవలం దెబ్బలబ్బాయిలం మాత్రవే! మీకు మాత్రం తెలీదా?' అన్నాడు అంచేత నువ్వు అనవసరంగా బుర్రపాడుచేసుకోకు" అన్నారు.

"భగవాన్! నేనడిగిందేవిటి? మీరు చెప్తున్నదేఁవిఁటీ?"

"అంత గాభరా ఎందుకే సుందరమ్మడూ. మనవేఁతప్పూ చెయ్యలేదు. తప్పు చెయ్యనప్పుడు భగవంతుడికైనా సరే భయపడవలసిన అవసరం లేదు. మరింక ఆ సంగతి మర్చిపో" అని ఓదార్చేరు.

"చూడు సుందరం, నీ జాతకంలో ఎక్కడా జైలు యోగం కనిపించడం లేదు. కాకపోతే ఇప్పుడు నడుస్తున్న దశ కొంత మనస్తాపం కలిగించి తీరుతుంది. అంతే" అని మానాన్న అభయం ఇచ్చేరు.

శాస్త్రిగారి సంగతి తెలిసిన దగ్గర్నుంచి మా నాన్న నా జాతక చక్రం జేబులో పెట్టుకుని చిలకతో సహా ప్రతి జ్యోతిష్కుడుకీ చూపిస్తున్నారు.

పాపం! ఎంతైనా కన్నకడుపు.

మా అమ్మ మాత్రం "నీ కెందుకే అనవసర రాతలు అని ఎన్నిసార్లు చెప్పేను? నీ బుర్రకేవైనా ఎక్కిందా? ఎందుకెక్కుతుందీ ఏలినాటి శని నెత్తి మీద డాన్సు చేస్తుంటే! నువ్వు ఈ ముష్టి కథలు రాయకపోతే దేశానికేం నష్టం రాదు. అయినా మొగుడూ, పిల్లలూ ఉన్నవాళ్లు చెయ్యవలసిన పని కాదు ఇది. పెళ్లీ, పెటాకులూ లేని వాళ్లైతే ఎలా పోయినా ఫరవాలేదు. ఎక్కడున్నా ఫరవాలేదు. ఈ పసివెధవల్ని ఏం చేద్దావఁనుకుంటున్నావు?" అని ఒకటే గోల.

పాపం! ఆవిడ తప్పు లేదు.

ఆవిడకున్న ఇద్దరు కూతుళ్లలో ఒకర్ని దేవుఁడెత్తుకొనిపోయేడు. మిగిలిన ఒక్కదాన్నీ పోలీసులు ఎత్తుకుపోతారేమోనని ఆవిడ బెంగ.

ఆలోచిస్తే ఆవిడన్నదాంట్లో అబద్ధం ఏం లేదు.

నా కథలు ఎవరు మెచ్చినట్టు?

ఓహో నేనేదో సోషల్ పర్పస్‌తో రాస్తున్నానని మురిసిపోవడమేగాని ఏం జరిగింది? నాపేరు సాహిత్య అకాడమీకి వెళ్లడానికి చాలా ఏళ్లు పట్టింది. కాని పోలీసుల లిస్టులోకి ఆర్నెల్లకే వెళ్లిపోయింది.

నేను లేడంటున్న దేవుడు పొరపాటున ఉన్నా నన్ను రక్షించడం వాడితరం కాదు! పోలీసు బలంముందు దైవబలం ఎంత?

"ఎలాగూ నాన్నే రాస్తారంటారు కదా. మరింక నీ బదులు నాన్నే వెళ్లొచ్చుకదా?" 'లా' పాయింటు లాగేరు పిల్లలు.

ఔనుస్మీ! నాకింతవరకు తట్టనేలేదు.

అందుకే అంటారు ఆపదలో ఉన్నవాడికి ఆలోచన ఉండదని. నిజానికి ఆడది జైలుకి వెళ్లడానికీ, మొగుడు జైలుకి వెళ్లడానికీ చాలా తేడా ఉంది.

నేను లేకపోతే పిల్లలు ఒక రకంగానే ఇబ్బంది పడతారు.

కాని తండ్రి లేకపోతే...

అమ్మో!

ఇల్లెలా గడుస్తుంది?

పిల్లల చదువులు?

"పాపం! బీనాదేవి" అంటారేమో కాని పైసా ఎవరూ యివ్వరు. ఓరి నాయనోయ్! నేనే వెళ్తాను.

ఇంట్లో అందరూ అప్పుడే ఎవరో పోయినట్లు, దిగులుగానూ, విషాదంగానూ ఉంటున్నారు. పిల్లలు సరే సరి. ఇంట్లో ఉన్నంతసేపూ నా చుట్టూ కూర్చుంటారు. తెల్లారి "అమ్మ ఉండదేమో" అన్నట్టు.

రాత్రిపూట నా గుండె చప్పుడు పోలీసులు కొట్టిన తలుపు చప్పుడులా వినిపించి దిగ్గున లేచి కూర్చునేదాన్ని. అన్నం దగ్గర కూర్చుంటే పిడతలో అన్నం, పురుగుల పులుసు కనిపించి అన్నం సహించేది కాదు. అయితే జడ్జిగారి భార్యని కాబట్టి అంత అధ్వాన్నంగా ఉండకపోవచ్చు.

విష్‌ఫుల్ థింకింగ్. తన్నకపోచ్చు నీకేం ఫరవాలేదన్న మావారి పోస్టల్ ఓదార్పులున్నా రోజులు గడవటం మానేశాయి. నీ బదులు నేను వెళ్తా అని కన్నీటి తుడుపుకైనా అనలేదు మానవుడు.

నేను, పిల్లలు పోలీసు పిలుపు కోసం ఎదురు చూస్తున్నాం. ఎక్కువ

రోజులు ఎదురు చూడనవసరం లేకుండా ఆ రోజు రానేవచ్చింది.

ఆవేళ ...

అప్పుడే చీకటి పడుతోంది.

మనసులో కూడా చీకటే.

ఆకాశంలో నక్షత్రాలు చచ్చిన చేపల కళ్లల్లా నిర్జీవంగా మెదుల్తున్నాయి.

నేను డాబా మీద పడుకుని ఆలోచిస్తున్నాను. రేపెక్కడుంటానో అన్న బెంగ.

పిల్లలేమైపోతారో నన్న దిగులు.

బహుశా మొగాడు ఇంత బాధ పడడేమో!

ఈసారి శాస్త్రిగార్ని అడగాలి...

పిల్లలంతా వరండాలో చదువుకుంటున్నారు.

అప్పుడప్పుడు పేజీలు తిప్పుతున్న శబ్దం.

ఇంతలో ...

టక్ ... టక్ .. టక్ ...

మెట్ల మీద బూట్ల శబ్దం.

నా గుండెల మీద ఎవరో నడుస్తున్నారు.

"అమ్మగారున్నారా?" కానిస్టేబుల్ అడిగేడు.

ఒక్క క్షణం...

ఆకాశంలో నక్షత్రాలన్నీ ఆరిపోయేయి.

అందరి గుండెలూ ఆగిపోయేయి.

మా అమ్మ లోపలి కెళ్లిపోయింది.

ముందు తేరుకున్నది నేనే.

"నేనే. ఏం?" అన్నాను.

అప్పుడప్పుడు మావారు కంట్రోలు రూంకి ఏదైనా మెసేజ్ పంపిస్తుంటారు.

అదేమోనన్న చిరు ఆశ అరక్షణం.

ఇప్పుడు తల్చుకుంటే నవ్వొస్తుంది. అరెస్టు చెయ్యడానికి కానిస్టేబుల్ రాడు. కాని గాభరాలో నాకా సంగతి తట్టలేదు.

"ఇనస్పెక్టరుగారు మిమ్మల్ని రమ్మంటున్నారు"

ఇనస్పెక్టరుకి నాతో ఏం పని?

గుమ్మంలో పోలీసు కారుంది. మా ఇంటికెదురుగానే కంట్రోల్ రూం. నాలుగడుగులకి కారెందుకు?

జడ్జిగారి పెళ్లాన్ని కదా. మర్యాదేమో!

ఇల్లంతా శ్మశాన నిశ్శబ్దం.

ఎవ్వరితోనూ వెళ్తున్నానని చెప్పలేదు.

నాకు పార్టింగ్ సీన్లు నచ్చవు.

అంచేత 'పద' అన్నాను.

"నేనూ వస్తాను" అని మా పెద్దవాడు కూడా బైల్దేరేడు.

కారు కంట్రోల్ రూం దగ్గర ఆగలేదు. అరండల్ పేట పోలీసు స్టేషన్ దగ్గర ఆగింది.

హమ్మయ్య! ఇక్కడ మా తమ్ముడి బేచ్‌మేట్ యస్సైగా ఉంటున్నాడు.

స్టేషను లోపలికెళ్లేం.

అక్కడున్న సిఐ, మిగతా పోలీసులు నాకు సలాం కొట్టేరు.

కుర్చీలు చూపించేరు.

నా నరాలు టెన్షన్‌తో తెగిపోతున్నాయి.

"మీరు కొంచెం ఇన్ఫర్మేషన్ ఇయ్యాలి మేడమ్?" అన్నాడు యస్సై.

కొంచెం ఏం ఖర్మం? గంపల్తో ఇస్తాను.

ఏవఁడుగుతాడు?

'ఫలానావాడు నీకేమౌతాడు?' అనా?

వేగం ... వేగం .. అడగడేం?

ఉరో, బరో చెప్తే మేకల్లోకి పోతానంటుందిట నాలాంటిదే.

"ఏయ్ వన్నాట్వూ, అతన్నిలా తీసుకురా" అని సి.ఐ. అనడం, కానిస్టేబుల్ వెళ్లడం, ఎవర్నో తీసుకొని రావడం త్రుటిలో జరిగేయి.

నేను తలొంచుకునే ఉన్నాను.

ఎవర్ని తెచ్చేరు?

ఎవర్ని? ఎవర్ని?

"ఇతన్ని చూడండి మేడమ్. నిన్ననే ఒక థెఫ్ట్ కేసులో పట్టుకున్నాం. మిమ్మల్ని తెలుసంటున్నాడు. మీరు  పోల్చుకుంటే వదిలేస్తాం."

తలెత్తేను.

ఎక్కడో చూసిన మొహం ... అంతే!

టెన్షన్ సడన్‌గా పోవడం వల్ల నాకు విపరీతమైన నీరసంతో గొంతుకలోంచి శబ్దం రాలేదు.

"అతను మాకు తెలుసు. చాలా మంచివాడు" మా పెద్దవాడే చెప్పేడు.

నేనెక్కడున్నాను?

గాలిలోనా? ఆకాశంలోనా?

ఒళ్ళంతా తేలిగ్గా అయిపోయింది.

అతనెలాంటి వాడైనా నన్నీ మానసిక క్షోభ నుండి కాపాడిన మహాత్ముడు.

"మీరు చెప్పేరు కాబట్టి వదిలేస్తున్నాం. సారీ ఫర్ ది ట్రబుల్ మేడమ్" అంటూ లేచేరు వాళ్లు.

వాళ్లు మమ్మల్ని కారులో ఇంటికి తీసికెళ్లినా, నేను వెళ్లింది మాత్రం గాల్లోనే.

★ ★ ★